క్లుప్తంగా

ఓటరుగా నమోదు చేసుకోండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ, ప్రతినిధులు

నారాయణఖేడ్: అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని ఖేడ్ ఆర్డీఓ అశోక చక్రవర్తి అన్నారు. శనివారం ఖేడ్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్- కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. అర్హులు విధిగా ఓటరుగా నమోదు చేయించుకునేలా పార్టీల ప్రతినిధులు కృషి చేయాలన్నారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. తహసీల్దారు భాస్కర్, పార్టీల ప్రతినిధులు తాహెర్ అలీ, పరమేష్, నగేష్, సాయిరాం, ఆనంద్, అశోక్, మొహిద్‌పటేల్ పాల్గొన్నారు.

విద్యార్థినుల పొలంబాట



ఆలుగడ్డ విత్తనం నాటే విధానాన్ని పరిశీలిస్తున్న విద్యార్థినులు

జహీరాబాద్: రాజేంద్రనగర్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాయ విద్యార్థినులు పొలంబాట పట్టారు. 'గ్రామీణ కృషి అనుభవ' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మండలంలోని పలు గ్రామాల్లో బృందాలుగా పర్యటిస్తున్నారు. వారు తరగతి గదుల్లో నేర్చుకున్న పాఠాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పరిశోధనలు చేస్తూ శిక్షణ పొందుతున్నారు. రైతులువిత్తనాలు వేసిన నాటి నుంచి పంట దిగుబడులు ఇంటికి చేరేదాక పాటించాల్సిన ఆధునిక పద్ధతుల గురించి పొలంబాట ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లో ఉంటూ రైతుల కష్ట సుఖాలు తెలుసుకుంటున్నారు. శనివారం మండలంలోని రంజోల్ గ్రామంలో సీడ్ డ్రిల్ ద్వారా ఆలుగడ్డ విత్తనం వేసే విధానం, వెల్లుల్లి విత్తు విత్తే విధానం, అరటి గెలలు కోత విధానంపై విద్యార్థులకు ఏఈఓ ప్రదీప్‌కుమార్ క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు.

ఎస్సీ హాస్టల్ తనిఖీ



హాస్టల్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

జిన్నారం (పటాన్‌చెరు) : జిన్నారం మండల కేంద్రం సమీపంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను శనివారం మండల ప్రత్యేక అధికారి సోమేశ్వర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల గదులు, బెడ్లు, భోజన గదులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం మెనూ, హాస్టల్లోని సమస్యలను వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తిన తన దృష్టికి తీసుకురావాలన్నారు. హాస్టల్లోని ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి మాణిక్యం, వార్డెన్ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థుల ఫీల్డ్ విజిట్



ఫీల్డ్ విజిట్‌లో విద్యార్థులు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు బృందం

పటాన్‌చెరు టౌన్: పరిశ్రమ ఫీల్డ్ విజిట్‌తో విద్యార్థులకు మరింత ప్రాక్టికల్ అవగాహన వస్తుందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ అన్నారు. పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య శాఖ విద్యార్థులు బండ్లగూడలో ఉన్న శ్రీ టెక్నాలజీస్ ఇండస్ట్రీని 60 మంది విద్యార్థులు వారి కరికులంలో భాగంగా సందర్శించారు. వారు తయారు చేస్తున్న రికార్డుల వివరాలు ఉత్పత్తుల, అమ్మకాలకు పరిశ్రమ వారు ఉపయోగిస్తున్న మార్కెటింగ్ పద్ధతులు, పనిచేస్తున్న సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. క్షేత్ర ప్రదర్శన వల్ల కామర్స్ విద్యార్థులకు పరిశ్రమ ఉత్పత్తులు, మార్కెటింగ్ విధానాలు, మేనేజ్‌మెంట్ లెవెల్స్, ఆర్థిక లావాదేవీలు రికార్డుల వివరాలపై ఒక అవగాహన వస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు డాక్టర్ యోగిబాబు, డాక్టర్ బేబీ రమణ, డాక్టర్ మంజుశ్రీ, డాక్టర్ పూనం కుమారి, డాక్టర్ షరీఫ్ మియా, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

కూలీల కొరత.. రైతుల కలత

- ఇతర ప్రాంతాల నుంచి కూలీల తరలింపు
- భారీ వర్షాల వల్ల పంటలకు తీవ్రనష్టం



కూలీల కొరతతో పొలంలోనే ఉన్న పత్తిపంట

న్యాల్‌కల్(జహీరాబాద్): రైతులు సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయంలో కూలీల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. స్థానికంగా కూలీల కొరత ఉండడంతో, తప్పని పరిస్థితుల్లో ఎక్కువ కూలీ ఇచ్చి ఇతర ప్రాంతాల నుంచి తరలిస్తున్నారు. జిల్లాలో గత ఏడాది 3.50లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. ఈ ఏడాది 3.90 ఎకరాల్లో సాగు చేశారు. గత కొన్నేళ్లుగా వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు దెబ్బతింటున్నాయి. మూడేళ్ల క్రితం ఎకరాకు 8 నుంచి 13 క్వింటాళ్ల పత్తి దిగుబడి రాగా, ఇటీవల కురిసిన వర్షాల వల్ల దిగుబడి తగ్గింది. ప్రారంభంలో పంట ఆశాజనకంగా ఉన్నప్పటికీ ఇటీవల ఏకధాటిగా కురిసిన వర్షాల కారణంగా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. క్వింటాలు ధర రూ.7,521లుగా ప్రభుత్వం నిర్ణయించింది. సీసీఐ కేంద్రాల ద్వారా పత్తిని కొనుగోలు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే పత్తిని తీసేందుకు కూలీలు దొరకక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. చేతికి వచ్చిన పంటను ఇళ్లకు తెచ్చుకుందామంటే కూలీల సమస్య తీవ్రంగా వేధిస్తోంది. అధిక డబ్బులు వెచ్చించి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, దేవరకొండ, కర్నూల్, కర్నాటక తదితర ప్రాంతాల నుంచి ఆటోలు, ఇతర వాహనాల ద్వారా తరలిస్తున్నారు. గత ఏడాది కూలీలకు కిలో పత్తితీస్తే రూ.10 చెల్లించారు. ఈ ఏడాది పంట సాగు విస్తీర్ణం పెరడంతో పాటు కూలీల కొరత అధికంగా ఉండడంతో కిలో పత్తి తీసేందుకు రూ.11 చెల్లిస్తున్నారు. కూలీలను ఇతర ప్రాంతాల నుంచి తరలించేందుకు అయ్యే రవాణా ఖర్చులు కూడా రైతులే భరించాల్సి వస్తుంది. పంట చేతికి అందుతున్నా ప్రభుత్వం ఇంకా జిల్లాలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు.

కూలీలు దొరకడం లేదు



పత్తి పంటను సాగు చేశాను.. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పంట తీవ్రంగా దెబ్బతిని దిగుబడి తగ్గింది. స్థానికంగా కూలీలు దొరకపోవడం వల్ల ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకువచ్చాను. వారికి కూలీ డబ్బులతో పాటు రవాణా ఖర్చులను భరించాల్సివస్తుంది. ఫలితంగా నష్టపోతున్నాం. ఈ సారి పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు.

– హోతి ప్రశాంత్, రైతు, న్యాల్‌కల్

అధిక వర్షాలతో నష్టం



భారీ వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్నాయి. ఏకధాటిగా వర్షాలు కురవడం వల్ల చెట్ల కింది భాగంలో కాసిన కాయలు కుళ్లిపోయాయి. ఆశించిన మేర దిగుబడులు వచ్చే అవకాశం లేదు. చేతికి వచ్చిన పంటను తీసుకుందామనుకుంటే కూలీలు దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– బీర్‌గొండ, రైతు, మిర్జాపూర్(ఎస్)

వైద్య సేవల్లో నిర్లక్ష్యం తగదు

- జోగిపేట ఆర్డీఓ పాండు



వైద్యులతో మాట్లాడుతున్న ఆర్డీఓ పాండు

జోగిపేట (అందోల్): రోగులకు వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం తగదని జోగిపేట ఆర్డీఓ పాండు సూచించారు. శనివారం జోగిపేట ఏరియా ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. వైద్యులు రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా వైద్య సేవలు అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌజన్యకు సూచించారు. వార్డులోని రోగులను వారికి అందుతున్న వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సీజన్ వ్యాధులు తగ్గుముఖం పట్టడంతో రోగుల సంఖ్య తగ్గిందని డాక్టర్ సౌజన్య తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

మండలాన్ని మున్సిపాలిటీగా మార్చొద్దు



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహను మండల కాంగ్రెస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం మంత్రిని కలిసి నాయకులు మండలాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయొద్దని విన్నవించారు. మండలం గొప్ప వ్యవసాయ భూమిని కలిగి ఉందని సన్నా చిన్నకారు రైతులు, వ్యాపారులు, యజమానులు జీవనోపాధి సాగిస్తున్నారని మున్సిపాలిటీగా రూపాంతరం చెందితే పెను సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వ్యవసాయ ఆధారిత భూమిని కోల్పోయే అవకాశాలు మెండుగా ఉన్నాయని మంత్రి దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో పీసీసీ మెంబర్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నర్సింగరావు, నాయకులు వీరారెడ్డి, ప్రతాపరెడ్డి, అజార్, శ్రీహరి పాల్గొన్నారు.

కేజీబీవీలో మరో ఇద్దరికి అస్వస్థత



చికిత్స పొందుతున్న విద్యార్థినులు

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లోని కేజీబీవీ(కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం)లో మూడు రోజులుగా విద్యార్థినులు అస్వస్థతకు గురవుతున్నారు. మొదటి రోజు ఇద్దరు, రెండవ రోజు 14 మంది విద్యార్థినులు, మూడవ రోజు శనివారం మరో ఇద్దరు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. దగ్గు, శ్వాస వ్యాధులతో ఇబ్బంది పడుతున్న వారిని మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించి పరీక్షలు నిర్వహించారు. వారి ఆరోగ్యం బాగుందని, విద్యార్థులందరికి మెరుగైన వైద్యం అందుతుందని తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన చెందవద్దని అధికారులు తెలియజేశారు.

కేజీబీవీని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మనోహర్‌రెడ్డి శనివారం కేజీబీవీని సందర్శించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. భవనానికి కలర్ వేస్తున్నందున్న విద్యార్థులు అస్వస్థతకు గురై ఉండవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అంతా ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఆయన వెంట వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

పుస్తకాల పంపిణీ

న్యాల్‌కల్(జహీరాబాద్): స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో శనివారం రెండో విడత ప్రభుత్వ పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రారంభమైంది. మొదటి విడత వచ్చిన పార్టు-1 పుస్తకాలను జూన్ నెలలో పంపిణీ చేశారు. ప్రస్తుతం 10,250 పార్టు-2 పాఠ్య పుస్తకాలు శుక్రవారం వచ్చాయి. శనివారం ఉదయం ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ రవి, సీఆర్‌పీలు రాజు, మాణిక్, గోపాల్ తదితరులు ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాండయ్య, సుధాకర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో వైద్య శిబిరం

జహీరాబాద్‌టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్సు డిపోలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరం నాలుగు రోజుల పాటు కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

కమిషనర్ బదిలీ

జహీరాబాద్: జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్‌రెడ్డి బదిలీ అయ్యారు. శనివారం ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీనివాస్‌రెడ్డి మెదక్ మున్సిపల్ కమిషనర్‌గా నియమితులయ్యారు. ఆయన స్థానంలో జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా ఉమామహేశ్వరావు నియమితులయ్యారు.

ఖర్గేను కలిసిన ఎంపీ షెట్కార్



ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సురేశ్

నారాయణఖేడ్: అఖిలభారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మల్లికార్జున్ ఖర్గేను శనివారం జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపీ మాణిక్యంఠాగూర్‌లను ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ సందర్శన**

నారాయణఖేడ్: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంటును శనివారం జిల్లాలోని సంగారెడ్డి, నారాయణఖేడ్, తెల్లాపూర్, జహీరాబాద్‌తో పాటు వికారాబాద్ మున్సిపాలిటీ కమిషనర్లు, శానిటరీ అధికారులు సందర్శించారు. చెత్త వ్యర్థాలతో వివిధ రకాల తయారీని పరిశీలించారు. ఆయా మున్సిపాలిటీల్లో సైతం చెత్త వ్యర్థాలతో వివిధ రకాల తయారీకి సంబంధించిన అంశాలపై అవగాహన పెంచుకున్నారు. సందర్శన ఎంతో ఉపయుక్తంగా ఉందని ఖేడ్ కమిషనర్ జగ్జీవన్, శానిటరీ అధికారి శ్రీనివాస్ తెలిపారు.

◆ **అక్రమ నిర్మాణం అడ్డగింత**

జిన్నారం (పటాన్‌చెరు) : జిన్నారం మండలంలోని అండూర్ సర్వే నంబర్ 118 వ్యవసాయ క్షేత్రంలో అక్రమ నిర్మాణాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. శనివారం అక్రమ నిర్మాణం వద్ద మాజీ సర్పంచ్ నరసింగరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు నిరసన వ్యక్తం చేస్తూ పనులు అడ్డుకున్నారు. ప్రజాభిప్రా య సేకరణ లేకుండా పంచాయతీ సెక్రటరీ అండదండలతో అక్రమ నిర్మాణం యథేచ్ఛగా కొనసాగుతుందని ఆరోపించారు. మండల అధికారులు తక్షణమే స్పందించి విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

◆ **దైవభక్తితో మానసిక ప్రశాంతత**

రంగంపేట పీఠాధిపతి మాధవనంద సరస్వతీ

జోగిపేట(అందోల్): ప్రతి ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలని రంగంపేట పీఠాధిపతి శ్రీ మాధవనంద సరస్వతీ అన్నారు. శనివారం జోగిపేటలోని రాచకొండ క్రిష్ణమూర్తి నివాసంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు ఓం శ్రీ మాత్రేయ నమః అనే జపాన్ని పఠిస్తూ 108 రకాల పూలతో స్వామి పాదుకకు పూజ నిర్వహించారు. అనంతరం స్వామిజీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి భావనతో నడుచుకోవాలని, భక్తితో ఉంటే మంచి పనులు చేయాలనే ఆలోచనలు వస్తాయని తెలిపారు. నిత్యం భగవంతుడిని స్మరించడంతో మానవ జీవనం సుఖసంతోషాలతో వర్ధిల్లుతుందన్నారు. భక్తులు డాక్టర్ అనంతరెడ్డి, పెంద్యాల రాములు, రవి, పత్తి వీరేశం, సుమన్,శ్రీధర్, సుబ్రహ్మణ్యం, ఆర్. ప్రభాకర్, భాగ్యమ్మ పాల్గొన్నారు.

◆ **విరాళాల సేకరణ**

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీమద్ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ధ్యాన మందిరానికి భక్తుల నుంచి విరాళాలు కొనసాగుతున్నాయి. శనివారం మల్లంపేట గ్రామస్తులు కుమార్ గుప్తా రూ. 21 వేల, సత్యనారాయణ గౌడ్ రూ. 20వేల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. గుడి అభివృద్ధిలో భాగస్వాములైన దాతలను విశ్వకర్మ సంఘం నాయకులు సన్మానించి, ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం నాయకులు భరత్‌చారి, విట్టల్ చారి తదితరులు పాల్గొన్నారు.

◆ **పీహెచ్‌సీ సందర్శన**

మునిపల్లి(అందోల్): మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గ్లోబల్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఇండియా ఆర్గనైజేషన్ (జీఏపీఐఓ) ప్రెసిడెంట్ డాక్టర్ సుంకు సురేందర్‌రావు సందర్శించారు. శనివారం మండల కేంద్రమైన మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, గవర్నమెంట్ హాస్పిటల్‌కు కావాల్సిన ల్యాబ్ ఈక్విప్‌మెంట్స్ కోసం కృషి చేస్తానని ప్రముఖ డాక్టర్ బాలరెడ్డి తెలిపారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చిన డాక్టర్లకు మాజీ ప్రజాప్రతినిధులు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, గోపులారం మాజీ ఎంపీటీసీ పాండు పాల్గొన్నారు.

◆ **కల్యాణలక్ష్మి చెక్కు పంపిణీ**

నారాయణఖేడ్: ఖేడ్ మండలం ర్యాకల్‌కు చెందిన గోసాయిపల్లి లక్ష్మికి కల్యాణలక్ష్మి మంజూరయింది. శనివారం ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి స్వగృహంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ఆమెకు చెక్కును అందజేశారు. మాజీ ఉప సర్పంచ్ జైపాల్, కాంగ్రెస్ నాయకు లు మాణిక్యం, సంగారెడ్డి, విఠల్ రెడ్డి ఉన్నారు.

గ్రామసభల్లోనే సమస్యలు పరిష్కారం



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ యాదగిరి

సంగారెడ్డి టౌన్ : గ్రామసభలోనే సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీఓ యాదగిరి అన్నారు. శనివారం మండలంలోని నాగపూర్‌లో ఉపాధి హామీ కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీల వారీగా ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ లు, గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామసభలో ఉపాధి హామీ పనులతో పాటు పింఛన్లు తదితర సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు, రైతులు, ఉపాధికూలీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి కృషి



కంప్యూటర్ అందజేస్తున్న అనుపమారెడ్డి

నారాయణఖేడ్: విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి సతీమణి అనుపమారెడ్డి పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పూర్వ విద్యార్థిని మహేశ్వరి కంప్యూటర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరు కిరణ్ సౌండ్ సిస్టంట్స్‌ను అనుపమారెడ్డి చేతుల మీదుగా పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాల పీజీహెచ్ఎం మన్మథకిషోర్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్ కృషితో ప్రస్తుత విద్యాసంవత్సరంలోనే 800 విద్యార్థులకు రూ.4 లక్షల విలువ గల బ్యాగులు, మరో రూ.2 లక్షల విలువ గల వివిధ సామగ్రిని దాతలు అందించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు దాతల సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్ రావు, రాజయ్య, రాజశేఖర్, చంద్రశేఖర్, సంగ్రాం, జైపాల్‌రెడ్డి, గురునాథ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- పుల్‌కల్ తహసీల్దార్ కృష్ణ



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

పుల్‌కల్(అందోల్): ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని పుల్‌కల్ తహసీల్దార్ కృష్ణ అన్నారు. మండలంలోని కోడూరులో శనివారం ఆయన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, ప్రసంగించారు. 17శాతం తేమ వరకు ఆరబెట్టిన ఏ గ్రేడు ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,320 చెల్లిస్తారని తెలిపారు. దళారులను ఆశ్రయిస్తే తేమ, తరుగు పేరుతో కోతలు విధిస్తారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. సన్నవడ్లకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తామన్నారు. సన్నవడ్లకు ప్రభుత్వం సూచించిన విధంగా క్వింటాలుకు రూ.500 అదనంగా బోనస్ లభిస్తుందన్నారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జగన్మోహన్‌రెడ్డి

- నేడు ప్రమాణ స్వీకారోత్సవం



జగన్మోహన్ రెడ్డి

జోగిపేట (అందోల్) : జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డిని నియమించారు. అందోల్ మండలం నేరేడుగుంట గ్రామానికి చెందిన ఆయన కాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. 1988లో మొట్టమొదటిసారి కాంగ్రెస్ పార్టీ మద్దతుతో నేరేడిగుంట సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 1991-93 వరకు స్కోర్ డైరెక్టర్‌గా పని చేశారు. రెండోసారి 2000 సంవత్సరంలో సర్పంచ్‌గా తిరిగి ఎన్నికయ్యారు. 2006-2009 వరకు సీడీసీ డైరెక్టర్‌గా సేవలను అందించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దామోదర్ రాజనర్సింహ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేశారు. జగన్మోహన్ రెడ్డి సేవలను గుర్తించిన మంత్రి జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించారు. నేడు మంత్రి దామోదర్ రాజనర్సింహ నేతృత్వంలో మార్కెట్ కమిటీ చైర్మన్‌తో పాటు సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

భవిష్యత్ కృత్రిమ మేధస్సుదే



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో శనివారం కృత్రిమ మేధస్సు, చాట్ జీపీటీపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన 'స్వేచ్ఛ' స్వచ్ఛంద సంస్థకు చెందిన ఎన్‌వీఎస్ఎస్ కౌండిన్య మాట్లాడుతూ.. భవిష్యత్ అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దేనని, రాబోయే కాలంలో ఇది మానవజీవన విధానంలో మారుతుందన్నారు. నిత్య జీవన విధానంలో కృత్రిమ మేధస్సు ఎలా ఉపయోగపడుతుంది, చాట్ జీపీటీ ప్రాధాన్యత, దానిని ఏ విధంగా ఉపయోగించుకోవాలో విద్యార్థులకు వివరించారు. తెలుగు యాసలో చాట్ జీపీటీని అభివృద్ధి చేసి దానికి సంబంధించి ఒక యాప్‌ని డిజైన్ చేశారు. ఈ యాప్ ఏ విధంగా పనిచేస్తుంది.. చాట్ జీపీటీ విద్యార్థులకు ఏలా ఉపయోగపడుతుంది, కృత్రిమ మేధస్సు ప్రాధాన్యం ఏమిటి?.. అది భవిష్యత్‌లో ఏయే రంగాలకు విస్తరించే అవకాశం ఉందనే అంశాలకు సంబంధించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా జగదీశ్వర్, వాణిజ్యశాస్త్ర అధిపతి డాక్టర్ జ్యోతి, టీఎస్‌కేసీ మెంటర్ రమణ, కామర్స్ అధ్యాపకులు డాక్టర్ ఉమామహేశ్వరి, వీరేందర్, డాక్టర్ కరుణ ఉన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

'సరియైన ఆహారంతోనే ఆరోగ్యవంతమైన జీవనం 'అనే అంశంపై శనివారం తారా కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన హార్టికల్చర్ అధికారి సునీత రోస్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఆహార భద్రతకు సంబంధించి 16 అక్టోబర్‌ను ప్రపంచ ఆహార దినోత్సవంగా జరుపుకొంటామన్నారు.

యాజమాన్య పద్ధతులతో పంటలకు మేలు



పసుపు పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సంగారెడ్డి: మండల పరిధిలోని అనంతసాగర్‌లో శనివారం ఏరువాక కేంద్రం, వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు పసుపు, వరి, పత్తి, అల్లం, తమలపాకు పంటలను పరిశీలించారు. ప్రధానంగా పసుపులో చీడపీడలు, తెగుళ్లకు యాజమాన్య పద్ధతులు మేలని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. శాస్త్రవేత్తలు పసుపు పంటలో దుంపకుల్లు తెగుళ్లను గమనించారు. వీటి నివారణకు మెటలాక్సిల్ 2 గ్రా.లీటర్ కలిపి బిందుసేద్య పద్ధతిలో పంపడం ద్వారా నివారించవచ్చని తెలిపారు, వరిలో తెగుళ్లు ఎక్కువగా ఉన్నాయని, వీటి నివారణకు ప్రాపికానాజోలు అనే మందును 1 మీ.లీ నీటితో పిచికారీ చేయాలన్నారు. పసుపు పంటలో విత్తిన పంట మొలిచిన తర్వాత మొక్కలపై ఎగదోసె పద్ధతి (ఎర్తింగ్ అప్) వల్ల నీరు, గాలి బాగా అంది, పెరిగిన దుంపను సూర్యరశ్మి నుంచి కాపాడటం వల్ల మార్కెట్‌లో మంచి రేటు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రాహుల్ విశ్వకర్మ, సరిత, శాస్త్రవేత్తలు డా .శ్రీజయ, డా.శ్వేత, గణేష్, ఉద్యానవన అధికారి శైలజ, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సెల్‌కు 17 ఫిర్యాదులు

- సీజీఆర్ఎఫ్ చైర్మన్ నాగేశ్వరరావు



మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

సంగారెడ్డి : విద్యుత్ సమస్యలపై కార్యాలయాల చుట్టూ ఎవరూ తిరగొద్దని, సత్వరమే పరిష్కరించడమే విద్యుత్ పరిష్కార వేదిక ముఖ్య ఉద్దేశమని కన్జ్యూమర్ గ్రీవెన్స్ రెడిషియల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) చైర్మన్‌నాగేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలు కిందిస్థాయిలో పరిష్కారం కాకుంటే కన్జ్యూమర్ గ్రీవెన్స్ సెల్‌కు నేరుగా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. విద్యుత్ సరఫరాలో లోపాలను గుర్తించి సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ఎస్ఈ శ్రీనాథ్ మాట్లాడుతూ.. వినియోగదారులకు ఈ ప్రాంతంలో మెరుగైన సేవలు అందించేందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. గ్రీవెన్స్‌సెల్‌కు 17 ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ సభ్యులు వెంకట్, సంగారెడ్డి విద్యుత్ డిఈ సురేందర్ రెడ్డి, విద్యుత్‌శాఖ ఏడీలు, ఏఈలు, విద్యుత్ సిబ్బంది, వినియోగదారులు, రైతులు పాల్గొన్నారు.